క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గుళ్లపల్లి విద్యార్థిని ఎంపిక



చెరుకుపల్లి: తమ పాఠశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు బాపట్ల జిల్లా నుంచి ఎంపిక కాబడటం అభినందనీయమని హెచ్ఎం కోనేటి కవిత అన్నారు. మండలంలోని గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని చేవూరు దేవి బాపట్ల జిల్లా నుంచి అండర్–17 విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైయింది. ఈసందర్భంగా పాఠశాలలో గురువారం చేవూరు దేవిని హెచ్ఎంతో పాటు విద్యాకమిటీ చైర్మన్ మంచాల విజయ్ కిషోర్, పీఈటీ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు దుండిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

దుండిపాలెం(వేమూరు): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దుండిపాలెం గ్రామంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించడం జరుగుతుందని గ్రామ సర్పంచి కుంచెల భగవత్ గీతా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున పాల్గొంటారని ఆమె తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆమె తెలిపారు.

మానవ హక్కుల కమిషన్ ఆవిర్భావ దినోత్సవం



తెనాలి: నేషనల్ చైర్మన్ ఆదేశాల ప్రకారం హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు ఆధ్వర్యంలో గురువారం జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. బడుగు, బలహీనవర్గాలు, సామాన్య ప్రజలకు ప్రశ్నించే హక్కుల కోసం భారత ప్రభుత్వం 1993 అక్టోబరు 12న జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. దీన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు రాజకీయ నేతలు, ప్రభుత్వ అధికారులు తగిన ప్రోత్సాహం ఇవ్వాలని ఆయన కోరారు. అనంతరం స్థానిక చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల అత్యవసర వార్డులో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాడిబోయిన కృష్ణ, తాళ్ల కిరణ్, సభ్యులు మరియదాసు, గోపి, అశోక్, రాజేష్ పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో వృద్ధులకు దుస్తుల పంపిణీ



తెనాలి టౌన్: గాంధీనగర్‌లోని షిర్డీ సాయి వృద్ధాశ్రమంలో సీపీఐ నాయకులు చెరుకుమల్లి సింగారావు తల్లి నారాయణమ్మ జ్ఞాపకార్థ వృద్ధులకు గురువారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నారాయణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్ పాల్గొని వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. సాయిమాధవ్ మాట్లాడుతూ కమ్యూనిస్ట్ పార్టీలో నారాయణమ్మ అనేక ఉద్యమాల్లో పాల్గొని ప్రజలకు ఎన్నో సేవలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీయోగా కన్వీనర్ ఎం.రమణయ్య, సహజకవి అయినాల మల్లేశ్వరరావు, అనూష, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అత్యుత్సాహం

మంగళగిరి: పట్టణంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి(శివాలయం)లో గురువారం బీజేపీ నాయకులు హడావుడి చేశారు. శివాలయంలో గత కొద్ది రోజులుగా రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. గర్భగుడిలో పనులు జరుగుతుండడంతో శివుని విగ్రహం మీద దుమ్ము ధూళి పడకుండా అర్చకులు స్వామి వారు కనిపించకుండా ముసుగు వేశారు. ఇది తెలుసుకున్న బీజేపీ నాయకులు పనులు జరుగుతున్నాయనే ఆలోచన లేకుండా ఆలయానికి వచ్చి అర్చకులపై జులుం ప్రదర్శించారు. ప్రధాన అర్చకుడి దుర్భాషలాడుతూ ఉద్యోగం తీసేయిస్తామని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బెదిరింపులకు దిగడంతో పాటు ఇన్‌చార్జి ఈఓ ఏ రామకోటిరెడ్డి చెప్పినా వినకుండా ఆందోళనకు దిగడం భక్తులతో నగర ప్రజలను విస్తుపోయేలా చేసింది. దీనిపై ఆలయ ఈఓ రామకోటిరెడ్డి మాట్లాడుతూ ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతున్న కారణంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిలిపివేయడం జరిగిందన్నారు. స్వామికి ఎక్కడా అపచారం జరగలేదని స్పష్టం చేశారు.

ఆరోగ్య సురక్ష.. ప్రజారోగ్యానికి రక్ష

- బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి
- అల్లూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేషస్పందన
- 750 మందికి పైగా వైద్యపరీక్షలు



దుండివారిపాలెం సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి



ఐలవరం ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కిట్లు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది

పిట్టలవానిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్యసురక్ష పేదల పాలిట వరమని బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి అన్నారు. పిట్టలవానిపాలెం మండలం అల్లూరు శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మండపంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ ఉప్పు చెంచులక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఈకార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఏపీని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు.

సురక్షకు హాజరైన వైద్యులు..

ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వినయ్, జనరల్ ఫిజిషియన్‌లు డాక్టర్ లీలా క్రాంత్ కర్మల్, డాక్టర్ మురళి, డాక్టర్ లోకేష్, ఎంఎస్ జనరల్ సర్జన్ డాక్టర్ కిన్నెర, ఎంఎస్ ఆప్తామాలజిస్ట్ డాక్టర్ అశ్వితలు పాల్గొని మొత్తం 750 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు.ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వాలి కృష్ణకుమారి, లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి చైర్మన్ వాలి శివారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, పార్టీ నాయకులు, కూసంపూడి దేవేంద్రరాజు, మండే విజయ్‌కుమార్, శ్యామల నాగిరెడ్డి, దబ్బుకూటి మాధవరావు, బొలగాని సుబ్బారావు, మాజీ సర్పంచ్ బడుగు ప్రకాశరావు, ఎనుముల కోటేశ్వరరావు, కుంతం ప్రసన్నరాజు, కుంతం ప్రసన్న రాజ్‌కుమార్, మేరుగు ధర్మారావు, అధికారులు, వైద్యసిబ్బంది, వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఐలవరంలో...

ఐలవరం(భట్టిప్రోలు): జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటివద్దకే వైద్యం అందిస్తున్నారని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరిలు అన్నారు. భట్టిప్రోలు మండలం ఐలవరం సచివాలయం–2 పరిధిలో గురువారం స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపం ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడమే సీఎం జగన్ లక్ష్యమన్నారు. ఈ క్యాంప్‌లో 386 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సురక్షా శిబిరంలో వైద్యులు సీహెచ్ రామలక్ష్మి, సీహెచ్ భువన, శ్యామ్ ప్రసాద్, సాయి చంద్, ఆప్తమాలజిస్ట్ అరుణరాణిలు పాల్గొని వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఎంఈఓ నీలం దేవరాజు, తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

దుండివారిపాలెంలో...

కర్లపాలెం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చారని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. గురువారం దుండివారిపాలెం గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కోన రఘుపతి సందర్శించి సురక్ష శిబిరంలో అందుతున్న వైద్య పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకంతో పేదలకు తమకు ఇష్టం వచ్చిన ప్రైవేటు ఆసుపత్రులలో ఉచితంగా వైద్యం చేయించుకునే అవకాశం కల్పించారని చెప్పారు. గ్రామ సర్పంచ్ పులుగు గోవిందమ్మ, ఎంపీటీసీ అక్కల వాణి, వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, నాయకులు మరుప్రోలు శివారెడ్డి, మందపాటి పరమానంద కుమార్, ఆట్ల నాగేశ్వరరెడ్డి, దొంతిరెడ్డి శివారెడ్డి, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు పోతనకట్టవారిపాలెంలో..

పిట్టలవానిపాలెం: మండలంలోని పోతనకట్టవారి పాలెం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు ఎనుముల కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొంటారని తెలిపారు.

నందిరాజుతోటలో...

బాపట్ల: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రతిఒక్కరికీ ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈకార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. గురువారం స్థానిక నందిరాజుతోటలోని సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష చేపట్టారు. వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు పీటా వేణుగోపాల్, మోర్ల సముద్రాల గౌడ్, నాగరాజు, పీటా వెంకటరమణ, బొర్రా సుబ్బారావు, భాస్కరరావు తదితరులు ఉన్నారు.

తుమ్మలపాలెంలో...

చెరుకుపల్లి: ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని అందుకోసమే జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తుమ్మలపాలెం సచివాలయం వద్ద గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎంపీడీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్ష వైద్య శిబిరంలో 211 మందికి వైద్యులు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసి జగనన్న సురక్ష కిట్లు అందజేశారన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచి చీరాల చెంచుదేవి, ఎంపీటీసీ పిట్టు శివసముద్రాలు, నాయకులు శివరామకృష్ణారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జువ్వలపాలెంలో...

కొల్లూరు: పేదవర్గాలకు మెరుగైన వైద్యసేవలు అందజేయడం కోసం ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. గురువారం మండలంలోని జువ్వలపాలెంలో నిర్వహించిన శిబిరంలో 571 మందికి వైద్యసేవలు అందించారు. బీపీ, షుగర్, ఇతర జబ్బులతో బాధపడుతున్నవారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. దృష్టి లోపంతో ఇబ్బంది పడుతున్నవారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రమణ, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు పాల్గొన్నారు.

చావలిలో..

చావలి(వేమూరు): జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం లాంటిదని ప్రజలందరు వినియోగించుకోవాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.వెంకట సురేష్ తెలిపారు. వేమూరు మండలంలోని చావలి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం 452 మందికి పరీక్షలు చేసి, రోగులకు మందులు పంపిణీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్షలో దీర్ఘకాలిక వ్యాధులు రోగులకు ప్రత్యేకంగా వైద్యసేవలు అందించడం జరిగిందని ఆయన తెలిపారు. డాక్టర్లు వెంకటలక్ష్మి, కోటేశ్వరి, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

మందూరులో...

మందూరు(వేమూరు): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా రోగులకు వైద్యసేవలు అందించడం జరుగుతుందని మండల ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి ఎస్.సింధూరి అన్నారు. చుండూరు మండలంలోని మందూరు గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. 607 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. డాక్టర్ రమేష్, శ్రావణి, తిరుపతి రెడ్డి, గ్రామ సర్పంచ్ జె.ఉమాదేవి, ఎంపీటీసీ రెడ్డి సూర్య ప్రభ, రెడ్డి రాజేంద్ర ప్రసాద్, కిషోర్, రెడ్డి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



నందిరాజుతోటలో మెడికల్ కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి



జువ్వలపాలెం వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



మందూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యసేవలు

పొలాల్లో ఏటా భూసార పరీక్షలు చేయించాలి

లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త గంగాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త గంగాదేవి

తెనాలి టౌన్: రైతులు పొలాల్లో ప్రతి ఏటా భూసార పరీక్షలు చేయించాలని, ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడాలాని లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త గంగాదేవి సూచించారు. రూరల్ మండలం నందివెలుగు సచివాలయ ఆవరణలో గురువారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ), వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా కేంద్రీయ విద్యాలయ పాఠశాల విద్యార్థుల ద్వారా సేకరించిన మట్టి నమూనా పరీక్షల సేకరణలో భాగంగా రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను పంపిణీ చేసి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆత్మ ప్రాజెక్టు ఉప వ్యవసాయ సంచాలకులు పి.రామాంజనేయులు అధ్యక్షత వహించారు. సదస్సులో శాస్త్రవేత్త గంగాదేవి మాట్లాడుతూ దుక్కిలో సూపర్ ఫాస్పెట్ వేయాలని రైతులకు సూచించారు. కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలని తెలిపారు. వ్యవసాయశాఖ కార్యాలయ జాయింట్ డైరెక్టర్ పద్మజ మాట్లాడుతూ భూమి ఆరోగ్యంగా ఉండే విధంగా చూడాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పొలాల్లో 35శాతం జింక్ లోపం ఉన్న భూముల్ని గుర్తించామన్నారు. రెండు పంటల్లో ఒకసారి 20 కిలోల జింక్ వేయడంతో పాటు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. బీడీఏ రత్నమంజుల మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లో 10 కేంద్రీయ విద్యాలయాలు, 10 నవోదయ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులు మట్టి పరీక్షలు నమూనాలు సేకరిస్తున్నారని తెలిపారు. వాటికి ల్యాబ్‌లో పరీక్షలు చేసి రైతులకు ఎరువులు వాడే వాడకం గురించి తెలియజేస్తారని చెప్పారు. తెనాలి కేంద్రీయ విద్యాలయం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైందని తెలిపారు. అధ్యక్షత వహించిన రామాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు తెనాలి మండలం నందివెలుగు, గుడివాడ గ్రామాల్లోని రైతుల పొలాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులతో కలసి 52 మట్టి నమూనాల యాప్ ద్వారా సేకరించారని తెలిపారు. సాయిల్ టెస్టింగ్ కిట్ (మినీ ల్యాబ్) ద్వారా విద్యార్థులే స్వయంగా వాటిని విశ్లేషించినట్లు చెప్పారు. సదస్సు ద్వారా రైతులను నేరుగా కలుసుకుని వారికి తాము తయారు చేసిన నమూనాల ఫలితాలను అధికారులతో కలసి రైతులకు అందజేశారు. గ్రామ సర్పంచ్ ధూళ్లిపాళ్ల పవన్‌కుమార్ మాట్లాడుతూ అధికారుల సిఫారసు మేరకు ఎరువులు వాడినట్లయితే పొలాలు బాగుంటాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు శివగగన్, యసశ్వీలు తమ అనుభవాలు, పొలాల్లో తాము నేర్చుకున్న విషయాలను రైతులతో పంచుకున్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ వేసవిలో పొలాల్లో పచ్చిరొట్ట పైరులు పెంచి, కలియదున్నాలని సూచించారు. రైతులకు సర్పంచ్ పవన్‌కుమార్, శాస్త్రవేత్త గంగాదేవి, జాయింట్ డైరెక్టర్ పద్మజ సాయిల్ టెస్టింగ్ కార్డులను అందజేశారు. సదస్సులో ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి, తెనాలి ఏడీఏ ఎస్.ఉషారాణి, ఏఓ జి.ప్రేమ్‌సాగర్, కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, రామిరెడ్డి, డీఆర్‌సీ రాజవంశీ, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ఏఈవో సౌజన్య, ఏఈవో మోహన్, వీఏఏ మౌనిక, పంచాయతీ కార్యదర్శి జి.సుభాష్ చంద్రబోస్, కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

15 నుంచి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు

ముస్తాబవుతున్న దేవాలయాలు

వెల్లటూరు(భట్టిప్రోలు): ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 15 నుంచి 9 రోజులపాటు అమ్మవార్లకు విశేష అలంకారంతో పాటు పూజలు నిర్వహించనున్నట్లు కట్లమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతి రోజూ ఉదయం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర శతనామావళి, సాయంత్రం సహస్ర నామావళి పూజలు జరుగుతాయని దేవాలయ అర్చకులు క్రోవి రామకృష్ణ, నిర్వాహకులు తెలిపారు. అలాగే వెల్లటూరు లాక్ సెంటర్‌లో కొలువైన కనకదుర్గా మహంకాళి నాగేంద్రస్వామి దేవాలయంలో 24వ తేదీ వరకు దసరా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు జొన్నా సుబ్బారావు భవాని తెలిపారు. ప్రతి రోజూ అమ్మవారికి ఉదయం అభిషేకాలు, కుంకుమార్చన, సాయంత్రం భజనలు జరుగుతాయని పేర్కొన్నారు.

సాయిబాబా ఆరాధనోత్సవాలు..



భట్టిప్రోలు: భట్టిప్రోలులోని షిర్డీ సాయిబాబా వారి 105వ ఆరాధనోత్సవాలు ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మన రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 రోజుల పాటు బాబావారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, బాబావారి ఛాలీసా పారాయణం, సంకీర్తనలు నిర్వహించనున్నారు. 25వ తేదీన నారాయణ సేవ జరుగుతుందని వివరించారు. అదేవిధంగా భట్టిప్రోలులో కొలువైన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు శ్రీకారం చుడుతున్నారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి, పార్వతీ అమ్మవార్లను ప్రతి నిత్యం ప్రత్యేక అలంకారాలలో తీర్చిదిద్దనున్నారు. దేవాలయంలో ప్రతి నిత్యం వాసవి అమ్మవారికి లక్ష్మీ గవ్వలతో అష్టోత్తర శత నామావళితో సామూహిక పూజలు జరగనున్నాయి. అలాగే ఉదయం, రాత్రి బతుకమ్మ పూజలు జరుగుతాయని దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. ప్రతి రోజూ ప్రత్యేక పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే భట్టిప్రోలులోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవాలయంలో కూడా దసరా మహోత్సవాల ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈయూ కృషి



నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు, హనుమంతరావు

తెనాలి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) ఎంతో కృషి చేస్తోందని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. తెనాలి ఆర్టీసీ డిపోలో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పలు సంఘాల నుంచి ఎంప్లాయీస్ యూనియన్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ జెఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఆర్టీసీ ఏండీ ద్వారక తిరుమలరావు సహకారంతో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం డిపో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.బాబు, కార్యదర్శిగా ఎం.సుధాకరరావు, గౌరవాధ్యక్షుడిగా పి.వీరయ్యబాబు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.మనోజ్ కుమార్, గ్యారేజ్ అధ్యక్షుడిగా డీడీఎస్.రావు, కార్యదర్శిగా వి.జోషిబాబును ఎన్నుకున్నట్లు చెప్పారు. గుంటూరు జిల్లా కార్యదర్శిగా ఈపూరి విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎండీ ప్రసాద్, సీనియర్ నాయకులు ఎం.హనుమంతరావు, కె.ఎస్.కరీముల్లా, యలమంద, అంజలీదేవి, ఐ.వి.రాజేష్‌ఖన్నా, డి.వి.స్వామిఖన్నా, నాగయ్య, కాశీం పాల్గొన్నారు.

అంగలకుదురుకు ఐఎస్‌ఓ సర్టిఫికేషన్

తెనాలి రూరల్: మండలంలోని అంగలకుదురు ప్రతిష్టాత్మక ఐఎస్‌ఓ 9000:2001 సర్టిఫికేషన్‌కు ఎంపికైంది. తనిఖీలో భాగంగా కేరళ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్(కిలా) నుంచి అధికారుల బృందం గురువారం గ్రామాన్ని పరిశీలించింది. ఐఏఎస్ అధికారిణి భీతు బాలకృష్ణన్ నేతృత్వం వహించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, అభివృద్ధి పనులతో పాటు పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు.
పరిపాలనపై సంతృప్తి వ్యక్తం చేశారు. మరో రెండు ఆడిట్ బృందాలు త్వరలో గ్రామాన్ని సందర్శించి పరిశీలిస్తాయని అన్నారు. అనంతరం పలు తనిఖీల ఆధారంగా సర్టిఫికేషన్ మంజూరవుతుందని భీతు బాలకృష్ణన్ తెలిపారు

జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తా



రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

తాడేపల్లిరూరల్: కృష్ణ, గుంటూరు జిల్లాల స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలలో ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లికి చెందిన బజరంగ్ స్పోర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు పలు విభాగాల్లో సత్తా చాటారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో అకాడమీ కార్యదర్శి, కోచ్ విష్ణుమొలకల సంఘవి మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన గుంటూరు జిల్లా గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ 14,17 బాక్సింగ్ పోటీలలో నలుగురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. సెప్టెంబర్ 29న కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో నిర్వహించిన అండర్–19 బాక్సింగ్ పోటీలలో నలుగురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అండర్– 19 బాలుర విభాగంలో (60 కేజీలు) మట్టవర్తి వివేక్, 52 కేజీల విభాగంలో ఎస్.కె. దావూద్ సనావుల్లా, 69 కేజీల విభాగంలో మహమ్మద్ నూరి రిహన్ శ్రీ, 66 కేజీల విభాగంలో చిటికరెడ్డి హేమంత్ ఎంపికయ్యారని, అదే విధంగా అండర్– 14 బాలుర విభాగంలో (42 కేజీలు) దొంత శశాంక్ పవన్‌కుమార్, అండర్– 17 బాలికల విభాగంలో (42 కేజీలు) పట్టేడి డోన శ్రీలక్ష్మి, 60 కేజీల విభాగంలో మహమ్మద్ అఫ్రవున్నీసా, 63 కేజీల విభాగంలో పెదపాటి బేబి భవ్యశ్రీ ఎంపికయ్యారని తెలిపారు.

చుక్కపల్లివారి పాలెంలో పాఠశాల ప్రారంభం



పాఠశాలను ప్రారంభిస్తున్న సర్పంచ్ సుందరమ్మ, ఎంపీపీ సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చుక్కపల్లివారిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సర్పంచి దాసరి సుందరమ్మ గురువారం ప్రారంభించారు. ఎంపీపీ డి.సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు డి.అరుణ హాజరై మాట్లాడుతూ గతంలో షాల్మేష్ ఆర్మీ ఎయిడెడ్ పాఠశాల ఉండేదని దానిని మూసివేశారని, విద్యార్థుల ఇబ్బందులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి ఏర్పాటుకు కృషి చేసినట్లు చెప్పారు. గతంలో ఉన్న షాల్మేష్ ఆర్మీ ఎయిడెడ్ పాఠశాల భవనానికి మరమ్మతులు చేయించి 1వ తరగతి నుండి ఐదో తరగతి వరకు పాఠశాలను పునః ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం ఒక టీచర్‌ను కేటాయించిందని, త్వరలోనే మరో టీచర్‌ను కేటాయించనున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేశ్వరి, ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, ఎంఈఓలు శ్రీనివాసరావు, లక్ష్మణరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, దుగ్గిరాల వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ఎస్.రత్నం, రజనీకాంత్, డి.వెంకటేశ్వరరావు, డి.వీరయ్య, డి.రమేష్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

భట్టిప్రోలు: బైక్‌పై వెళుతున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తూ విద్యుత్ స్తంభానికి ఢీకొని మృతి చెందిన సంఘటన ఇది. భట్టిప్రోలు పోలీసుల కథనం ప్రకారం రేపల్లెని ఓ రెస్టారెంట్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న తాళ్లూరి అరుణ్ (29) తన బాబాయి ఉంటున్న తెనాలికి బుధవారం రాత్రి బైక్‌పై బయలు దేరాడు. భట్టిప్రోలు మండలం గొరిగపూడి దాటగానే బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్నాడు. తీవ్ర గాయాలతో ఉన్న అరుణ్‌ను గుర్తించి అటుగా వెళుతున్న ఓ లారీ డ్రైవర్ ఒంటిగంట సమయంలో 108కు కాల్ చేసి సమాచారం అందించారు. సమాచారం మేరకు అతడిని తెనాలి ఏరియా వైద్యశాలకు తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఇతడు సంగారెడ్డి జిల్లా కోంపల్లి గ్రామం సాయిబాబానగర్‌కు చెందిన వాసి అని, అవివాహితుడని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ తెలిపారు.